గ్రామీణ వైద్యం బలోపేతం

గ్రామీణ ప్రాంతాల్లో పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లు ఉన్నా.. స్థానిక ప్రజలకు కనీస వైద్య సేవలు అందడం కూడా గగనంగా ఉండేది. దిష్టిబొమ్మల్లా ఆస్పత్రి భవనాలు ఉండేవి. ఆయా భవనాల్లో కనీస వసతులు లేక.. సిబ్బంది సైతం విధులకు హాజరు కాలేని పరిస్థితి. పేద మధ్య తరగతి ప్రజలకు గతంలో సరైన వైద్యం అందక కార్పొరేట్ హాస్పిటల్స్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఇదంతా గతం. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక గ్రామీణ వైద్య సేవలపై దృష్టి సారించారు. నాడు–నేడు ప్రణాళికలతో పీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల ఆధునికీకరణ చర్యలు చేపట్టారు. ప్రతి సచివాలయానికి అనుబంధంగా విలేజ్ క్లినిక్స్‌కు శ్రీకారం చుట్టారు. తాజాగా ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష పథకాలతో ఇంటి వద్దకే వైద్యం అందించేందుకు కొత్త పథకాలను ప్రవేశ పెట్టింది.

నాడు–నేడుతో మౌలిక వసతుల కల్పన

- రూ.32 లక్షలతో చేజర్ల, చిత్తలూరు పీహెచ్‌సీల ఆధునికీకరణ
- వైద్య సేవలు బలోపేతం చేసే దిశగా చర్యలు


చేజర్ల పీహెచ్‌సీలో పూర్తయిన భవనం ఆధునికీకరణ

చేజర్ల: గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేద, మధ్య తరగతి వారికి ఉన్నత స్థాయి వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నడుంబిగించారు. ఇప్పటికే నాడు–నేడు పథకం ద్వారా పాత పీహెచ్‌సీలను ఆధునికీకరిస్తుండగా, అవసరమైన ప్రాంతాల్లో కొత్త పీహెచ్‌సీలను నిర్మించారు. ప్రతి ఊరులో వైద్యాలయం ఉండాలని వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే కొన్ని పూర్తయి సేవలు అందిస్తుండగా, మరికొన్ని నిర్మాణానికి చివరి దశలో ఉన్నాయి. ఆస్పత్రులను ఆధునికీకరించడమే కాకుండా గ్రామీణ వైద్య సేవలు బలోపేతం చేసే దిశగా ప్రతి అడుగు పటిష్టంగా వేస్తున్నారు. 104 వాహనం ద్వారా రెగ్యులర్‌గా గ్రామీణులకు వైద్య సేవలు అందించే విధంగా పీహెచ్‌సీ పరిధిలో జనాభాను బట్టి వైద్యుల సంఖ్యను పెంచారు. మందుల కొరత లేకుండా మరికొన్ని మందులను కూడా అందుబాటులోకి తెచ్చారు. వీటితో పాటు ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తూ ఇంటి వద్దకే వైద్య సేవలు అందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇదీ చాలదన్నట్లుగా ప్రతి ఇంట్లో అనారోగ్య బాధితుల గుర్తింపు కోసం జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా జల్లెడం పడుతున్నారు.

మండలంలో చేజర్ల, చిత్తలూరులో పీహెచ్‌సీలు ఉన్నాయి. ప్రతి రోజు ఆయా పీహెచ్‌సీలకు 60 నుంచి 80 మంది రోగులు వైద్యం కోసం వస్తుంటారు. వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారు. పీహెచ్‌సీల్లో ప్రాథమికంగా బీపీ, షుగర్, ప్రెగ్నెన్సీ టెస్ట్‌లతో పాటు మలేరియా, డెంగీ వంటి క్రిటికల్ టెస్ట్‌లు కూడా పీహెచ్‌సీల్లో చేసే విధంగా అప్‌గ్రేడ్ చేశారు. అయితే ఆస్పత్రి భవనాలు, పరిసరాలు పాడుబడిన స్థితిలో ఉండడంతో పాటు ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కొరవడ్డాయి. ఈ నేపథ్యంలో నాడు–నేడు పథకం క్రింద చేజర్ల, చిత్తలూరు వైద్యశాలను ఆధునికీకరిస్తున్నారు. చేజర్ల హాస్పిటల్‌కు రూ.17 లక్షలు, చిత్తలూరు హాస్పిటల్‌కు రూ.15 లక్షలతో ఆధునికీకరిస్తున్నారు. ఇప్పటికి దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్


రూపాయి ఖర్చు కావడం లేదు



జగనన్న ప్రభుత్వం ఏర్పడ్డాక నాణ్యమైన వైద్య సేవలు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అందుతున్నాయి. నాకు ఆరోగ్యం బాగాలేక చేజర్ల పీహెచ్‌సీలో చూపించుకున్నాను. ఓపీ దగ్గర నుంచి ఇంటికొచ్చే వరకు రూపాయి ఖర్చు కాలేదు. అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందజేశారు. ఇది మా లాంటి పేదలకు ఎంతో ఉపయోగం.

– జి రోశయ్య, టీకేపాడు చేజర్ల మండలం

విశ్రాంత కాలానికి ఆరోగ్య ఆసరా



గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ ద్వారా అరకొర వైద్య సేవలందించేవారు. జగనన్న ప్రభుత్వ ఏర్పడ్డాక దాదాపు అన్ని రకాల జబ్బులను ఆరోగ్యశ్రీలో చేర్చారు. ఉచితంగా ఆపరేషన్లు చేయడమే కాకుండా అనంతరం విశ్రాంతి తీసుకొంటున్న కాలానికి సైతం ఆరోగ్య ఆసరా కింద రోజుకు రూ.225 చొప్పన చెల్లిస్తున్నారు. ఇది ఒక్క జగనన్నకే సాధ్యం.

– పాలపాటి వెంకటేశ్వర్లు మడపల్లి, చేజర్ల మండలం

ఆరోగ్యశ్రీ ద్వారా సంతృప్తికర వైద్య సేవలు



ఆగ్యోశ్రీ పథకం ద్వారా రోగులకు సంతృప్తి స్థాయిలో ఉచితంగా వైద్య సేవలందుతున్నాయి. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరం. వైద్యం ఖరీదైన నేటి కాలంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్య సేవలు పొందాలి. పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు.

– డాక్టర్ ఎస్‌కే మెహతాబ్, చేజర్ల పీహెచ్‌సీ

క్లుప్తంగా

ముగిసిన ఎంవీఆర్ క్రికెట్ టోర్నమెంట్


సోమశిల: విజేతలకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దారు సుభాషిణి

సోమశిల: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బట్రెడ్డి జనార్దన్ రెడ్డి సహకారంతో జాలీబాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంవీఆర్ క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిసాయి. 28 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో జాలీబాయ్స్ టీం విజేతగా, గౌరవరం టీం రన్నరప్‌గా నిలిచింది. తహసీల్దారు సుభాషిణి విజేత జాలీబాయ్స్ జట్టుకు రూ.20 వేలు, రన్నరప్‌గా నిలిచిన గౌరవరం జట్టుకు రూ.10 వేలు అందజేశారు.

బైపాస్ బస్సు సర్వీసులు

ఉదయగిరి: ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి నెల్లూరు సెక్టార్‌లో తిరిగే పలు బస్సు సర్వీసులను సంగం ఊర్లోకి వెళ్లకుండా బైపాస్ మీదుగా నడుపుతున్నట్లు డిపో మేనేజరు శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ నెల 22వ తేదీ నుంచి ఉదయగిరి నుంచి నెల్లూరు వెళ్లే ఉదయం 6.30, 8.30, 11.30, మధ్యాహ్నం 1.30, 2.30 సాయంత్రం 5 గంటలకు, నెల్లూరు నుంచి ఉదయగిరికి వచ్చే ఉదయం 7.00, 7.45, 9.30,10.30,11.30, మధ్యాహ్నం 2.00, 3.30, సాయంత్రం 5 గంటలకు బస్సులు సంగం బైపాస్ మీదుగా వస్తాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ వైద్యం


తిక్కవరంలో జగనన్న ఆరోగ్య సురక్షను పరిశీలిస్తున్న జేసీఎస్ కన్వీనర్, ఇతర ప్రజాప్రతినిధులు

మర్రిపాడు: ప్రతి కుటుంబానికి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా సంపూర్ణ వైద్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని మండల జేసీఎస్ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తిక్కవరంలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడమే ధ్యేయంగా వైద్య సేవలు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాగమణి, నాయకులు చంద్రా నారాయణస్వామి, గంగినేని బాబు, గంగినేని శ్రీను, సచివాలయ సిబ్బంది, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


కలిగిరి: రోగులకు మందులు పంపిణీ చేస్తున్న మండల కన్వీనర్ రవీంద్రారెడ్డి

కలిగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి తెలిపారు. లక్ష్మీపురం సచివాలయంలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి. వెంకటేశ్వరరావు, సర్పంచ్ దాసరి కొండమ్మ, ఉపసర్పంచ్ కందుల వెంకటరమణమ్మ, స్థానిక నాయకులు మల్లు రియాజ్‌రెడ్డి, వెంకటరత్నం, కందుల అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండాపురానికి సాగునీరు అందించండి


రాజగోపాల్‌రెడ్డితో మాట్లాడుతున్న నేతలు

కొండాపురం: సోమశిల ఉత్తర కాలువ ద్వారా కొండాపురం మండలంలో సాగు చేసిన పంటలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులరెడ్డి ఉదయగిరి సమన్వయ కర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని కోరారు. శుక్రవారం ఆయన జలదంకి మండలం జమ్మలపాళెం వద్ద మండల అధ్యక్షుడు చిమ్మిలి రవీంద్రతో కలిసి విన్నవించారు. స్పందించిన రాజగోపాల్‌రెడ్డి వెంటనే అధికారుతో ఫోన్‌లో మాట్లాడి నీరు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

డీబీకేఆర్ ప్రీమియర్ లీగ్ విజేత కంపసముద్రం


నగదు బహుమతిని అందజేస్తున్న దృశ్యం

మర్రిపాడు: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని కంపసముద్రం ఎస్సీ కాలనీలో నిర్వహించిన డీబీకేఆర్ ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీల విజేతగా కంపసముద్రం జట్టు నిలిచింది. వైఎస్సార్‌సీపీ నేత దుగ్గిరెడ్డి కృష్ణప్రసాద్‌రెడ్డి సహకారంతో ఈ పోటీలు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో కంపసముద్రం, ఉదయగిరి జట్ల మధ్య జరగ్గా కంపసముద్రం జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.30,116, రన్నరప్‌గా నిలిచిన ఉదయగిరి జట్టుకు రూ.15,116 అందజేశారు. ఈ కార్యక్రమంలో చెన్ను శ్రీధర్‌రెడ్డి, సన్నపురెడ్డి చక్రవర్ధన్‌రెడ్డి, దుగ్గిరెడ్డి వెంకటేష్, వీఆర్‌ఓ రాజశేఖర్, కాలువ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు చెల్లించండి

ఆత్మకూరు: ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ ఆత్మకూరు కార్యవర్గ సభ్యులు శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద నుంచి మున్సిపల్ బస్టాండ్ వరకు సాగింది. అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్మించారు. యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు గంగాధర్ మాట్లాడుతూ పీఎఫ్ సరెండర్ లీవ్, ఏపీజీఎల్ఐ వంటి పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా, తాలుకా కార్యవర్గ సభ్యులు శివ ప్రసాద్, వి మల్లికార్జున, ఎస్‌వీ ప్రసూన, రజనీ ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విజయీభవ యాత్ర

- ఎన్నికల శంఖారావం పూరించనున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- అదే సమయంలో అభివృద్ధి పనులు ప్రారంభం, కొత్త పనులకు శ్రీకారం
- ప్రజల ఆశీర్వాదం తీసుకునేందుకే ఊరూరా చైతన్య ప్రచారం


ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి అకాల మరణంతో ఆ స్థానం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించిన మేకపాటి విక్రమ్‌రెడ్డి గడిచిన ఏడాదిన్నర కాలంలోనే నియోజకవర్గంలో అసమాన అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. కొన్ని దశాబ్దాలుగా అభివృద్ధి మెట్లు ఎక్కని ఆత్మకూరు నియోజకవర్గాన్ని దివంగత గౌతమ్‌రెడ్డి అభివృద్ధిలో కొంత పుంతలు తొక్కించారు. చెంతనే జలాశయం ఉన్నా.. మెట్ట ప్రాంతంగా మిగిలిపోయిన నియోజకవర్గానికి సాగునీరు పారించి సస్యశ్యామలం చేశారు. ఈ ప్రాంత నిరుద్యోగ యువత ఆశలు నెరవేర్చేందుకు ఆత్మకూరుకే ప్రతిష్టాత్మకంగా పారిశ్రామికవాడ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అభివృద్ధి మధ్య దశలో ఉండగానే గౌతమ్‌రెడ్డి అకాలంగా కాలం చేయడంతో ఆ అభివృద్ధి ప్రణాళికలను అందిపుచ్చుకున్న ఆయన సోదరుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి జిల్లాలోనే కాదు.. రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దే పనిలో కృత నిశ్చయంతో పని చేస్తున్నారు. సమీప భవిష్యత్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రజల ఆశీర్వాదాలు పొందేందుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించేందుకు ఉద్దేశించిన విజయీభవ యాత్ర 21వ తేదీ ఆదివారం ఉదయం నుంచి ప్రారంభం కానున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో సుభిక్షంగా ఉన్న ప్రజల ఆశీర్వాదం తీసుకునేందుకు ఊరూరా చైతన్య ప్రచారం చేయనున్నారు. ఈ యాత్ర ద్వారా అన్ని గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించనున్నారు. అదే సమయంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించడంతో పాటు మంజూరైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు వివరించారు. ఎన్నికల ప్రచారం ప్రారంభమే. ఈ విజయీభవ యాత్ర ఏఎస్‌పేట మండలం హసనాపురం నుంచి ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఆత్మకూరు మండలం రామస్వామిపల్లి నుంచి వింజమూరు మండలం నల్లగొండ వరకు డీసీ పల్లి, వెన్నవాడ, గండ్లవేడు మీదుగా రూ.9.30 కోట్లతో మంజూరైన తారు రోడ్డు, బొగ్గేరుపై కాజ్‌వే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. పైలాన్ ఆవిష్కరిస్తారన్నారు. మరుసటి రోజు 22వ తేదీ అప్పారావుపాళెం నుంచి విజయీభవ యాత్ర ప్రారంభం అవుతుందని, 23వ తేదీ ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నరసాపురం, శాంతినగరం, వెంకట్రావుపల్లి, జాలయ్యనగరం, ముస్తాపురం గ్రామాల్లో జరగనుందని తెలిపారు. 24వ తేదీ చేజర్ల మండలం కోటితీర్థం, చేజర్ల, యనమదల గ్రామాల్లో సాగుతుందని, 25న సంగం మండలం వంగల్లు సంగం, కొరిమెర్ల, నీలాయపాళెం గ్రామాల్లో సాగుతుందని వివరించారు. పార్టీ మండల అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మున్సిపల్ కార్యవర్గ సభ్యులు, పీఏసీఎస్ అధ్యక్షులు, బూత్ లెవల్ ఏజెంట్‌లు, కమిటీ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని మేకపాటి విజయీభవ యాత్రను జయప్రదం చేయాలని కోరారు.

కులగణన సర్వే ప్రారంభం


చేజర్లలో కులగణన సర్వే చేస్తున్న ఎంపీడీఓ


వరికుంటపాడు: సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

ఉదయగిరి: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో శుక్రవారం కులగణన సర్వే ప్రారంభమైంది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి నమోదు చేశారు. ఈఓపీఆర్డీ మల్లికార్జున గన్నేపల్లి, నేలటూరుల్లో సర్వేను పరిశీలించి సిబ్బందికి సూచనలందించారు. సిబ్బంది ఈ సర్వేను పక్కాగా నిర్వహించాలన్నారు.

కులగణన సర్వేకు సహకరించండి

ఆత్మకూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మున్సిపల్ పరిధిలో ప్రారంభమైన కులగణన సర్వేను వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది చేస్తున్నారని, వారికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు కోరారు. తన కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ కులగణన సర్వేలో వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సర్వే సులభంగా అర్థమయ్యే అంశాలతో యాప్ రూపొందించినట్లు, సర్వేలో సిబ్బందికి ఎటువంటి రుజు పత్రాలు చూపించాల్సిన అవసరం లేదని, కేవలం సమాచారం మాత్రమే తెలపాలని ప్రజలను కోరారు.

బాధ్యతగా కులగణన సర్వే

వరికుంటపాడు: మండలంలో జరుగుతున్న కులగణన సర్వేను వలంటీర్లు సచివాలయ సిబ్బంది బాధ్యతగా నిర్వహించాలని, కావలి డివిజన్ కో–ఆపరేటివ్ అధికారి, వరికుంటపాడు మండల ప్రత్యేక అధికారి తిరుపాల్ రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మండలంలోని జడదేవిలో జరుగుతున్న కులగణన సర్వేను ఎంపీడీఓ శ్రీదేవితో కలిసి పరిశీలించారు. ఈ సర్వేను సిబ్బంది నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 28వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆన్ లైన్‌లో సమాచారాన్ని నమోదు చేయాలన్నారు.

చేజర్ల: మండలంలో శుక్రవారం కులగణన ప్రారంభమైంది. ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది కుటుంబ పెద్ద ద్వారా ఆ కుటుంబ స్థితిగతులు, కులగణన వివరాలు నమోదు చేసుకొంటారన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో కీర్తి, ఆరోగ్యం


చేజర్ల: ఆడుదాం ఆంధ్రా వాలీబాల్ విజేత చేజర్ల సచివాలయం జట్టు


మర్రిపాడు: నియోజకవర్గ స్థాయికి ఎంపికైన సింగనపల్లి క్రికెట్ జట్టు

- పూర్తయిన మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు

ఆత్మకూరు: క్రీడలపై ఆసక్తి చూపితే కీర్తితో పాటు ఆరోగ్యం, మానసిక పరిస్థితి మెరుగవుతుందని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ మాట్లాడుతూ మండల స్థాయి విజేతలు నియోజకవర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో తదితర క్రీడల్లో 19 సచివాలయాల క్రీడాకారులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారన్నారు. పురుషుల జట్లలో ఆత్మకూరు అర్బన్ నుంచి, మహిళల విభాగంలో ఆత్మకూరు గ్రామీణం నుంచి ఎక్కువ మంది విజయం సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీ తిరుపతయ్య, మున్సిపల్ ఆర్ఐ ఖాసీం, పాఠశాల హెచ్ఎం అనంతలక్ష్మీ, పలు పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.

వాలీబాల్ మండల విజేత చేజర్ల

చేజర్ల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌లో చేజర్ల జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం చేజర్ల, ఏటూరు టీమ్‌ల మధ్య వాలీబాల్ మ్యాచ్ జరిగింది. చేజర్ల సచివాలయం జట్టు ఏటూరుపై 10 పాయింట్ల తేడాతో గెలిచింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా, మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ పి మల్లికార్జున, హెచ్ఎం హైమావతి, ఎంఈఓలు కళాధర్, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి విజేత సింగనపల్లి జట్టు

మర్రిపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో భాగంగా క్రికెట్ పోటీల్లో సింగనపల్లి జట్టు మండల స్థాయిలో విజేతగా నిలిచి నియోజకవర్గ స్థాయికి ఎంపికైంది. మర్రిపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో శుక్రవారం సింగనపల్లి, పొంగూరు జట్ల మధ్య క్రికెట్ పోటీల ఫైనల్స్ జరిగాయి. ఫైనల్ జరగ్గా సింగనపల్లి జట్టు 10 ఓవర్లలో 51 పరుగులు చేసింది. 52 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన పొంగూరు జట్టు 5 పరుగుల తేడాతో ఓటమి పాలైంది.


ఆత్మకూరు: మండల స్థాయి విజేతలను అభినందిస్తున్న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిన ప్రజలు

విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం విగ్రహావిష్కరణ కావలి, ఆత్మకూరు డివిజన్ల పరిధిలోని ఊరూరు నుంచి ప్రజలు ప్రత్యేక బస్సులు, వాహనాల్లో తరలివెళ్లారు.


ఆత్మకూరురూరల్: మురగళ్ల నుంచి తరలివెళ్తున్న అంబేడ్కర్ అభిమానులు


చేజర్ల: బస్సుకు జెండా ఊపి పంపుతున్న ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా తదితరులు


కలిగిరి: కలిగిరి నుంచి జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్లిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అభిమానులు



కొండాపురం: పార్టీ నేతలు చిమ్మిలి రవీంద్ర, కర్తం శ్రీనివాసులరెడ్డి, వేమిరెడ్డి మల్లికార్జున రెడ్డి, దార్ల గోపి, కొండలరావు, కమలాకర్ తదితరులు


అల్లూరు: బస్సులను విజయవాడకు పంపుతున్న నీలం సాయికుమార్, దండా కృష్ణారెడ్డి


వరికుంటపాడు : జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి, నాయకులు

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

- కర్నాటి ఆంజనేయరెడ్డి


వికసిత్ భారత్‌లో క్యాలెండర్లు అందజేస్తున్న నాయకులు, అధికారులు

ఆత్మకూరు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేద మహిళలు, రైతులకు అందజేస్తున్న అనేక సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయ రెడ్డి అన్నారు. మున్సిపల్ కమిషనర్ బల్లి నాగేశ్వరరావు, మెప్మా సీఈఓ అంకయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ సమీపంలో శుక్రవారం వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మన సంకల్పం వికసిత భారత్ క్యాలెండర్లు, కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు కంది మల్లికార్జునరెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, కె.సుధాకర్, ఎన్‌జీఓ సిద్ధం పెంచల నరసయ్య, మెప్మా సిబ్బంది మాధవి, వెంకట రమణమ్మ, ఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.